సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



పాలన గాడిన పడినట్లేనా?

కేయూ రెగ్యులర్ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి నేటితో ఏడాది పూర్తవుతోంది. ఆయన పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది.

- 10లో▸



ముగిసిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శనివారం ముగిశాయి.

- 10లో▸

గరిష్టం/కనిష్టం $30^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడాపోటీలతో స్నేహపూర్వక సంబంధాలు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడా పోటీలతో వ్యక్తుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడుతాయని హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలోని టెన్నిస్ గ్రౌండ్‌లో శనివారం లాన్‌టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో అశోక్‌కుమార్ మాట్లాడారు. అనంతరం విజేతలుగా నాగయ్య(ఏసీపీ), శ్రీధర్(ఆర్ఐ) జట్టు నిలవగా, రన్నరప్‌గా నిలిచిన రడం శ్రీనివాస్, తిప్పాని సాత్విక్‌ల జట్టుకు అతిథులు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నల్ల సురేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, సంఘం ప్యాట్రన్ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు కౌసర్ ఎంపిక



వరంగల్: పంజాబ్ రాష్ట్రంలోని తల్వండిలోని గురుకాశి విశ్వవిద్యాలయంలో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ చాంపియన్‌షిప్-2025 పోటీలకు దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి మహమ్మద్ తన్వీర్ కౌసర్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి తెలిపారు. ఈ పోటీలు అక్టోబర్ 24-31వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కౌసర్‌ను ధర్మారెడ్డితోపాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎల్‌వి.వరప్రసాదరావు, స్పోర్ట్స్ ఎస్.చంద్రమోహన్, అధ్యాపకులు అభినందించారు.

వాయిదాపడిన పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్: తెలంగాణ బంద్ నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన వివిధ పరీక్షల నిర్వహణ తేదీలను రీషెడ్యూల్ చేస్తూ పరీక్షల విభాగం అధికారులు శనివారం ప్రకటించారు. దూరవిద్య సీఎల్ఐఎస్సీ పరీక్షలను ఈనెల 24న, మూడేళ్ల లాకోర్సు మొదటి, ఐదో సెమిస్టర్ పరీక్షలు, ఐదేళ్ల లాకోర్సు ఐదో, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 21న నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ శనివారం తెలిపారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25న, ఎంటెక్ రెండో సెమిస్టర్ పరీక్షను ఈనెల 31న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రూ.1.50 కోట్ల ఆదాయం కోల్పోయిన ఆర్టీసీ

హన్మకొండ: బీసీ బంద్‌తో ఆర్టీసీకి నష్టం జరిగింది. బస్సులన్నీ మధ్యాహ్నం వరకు డిపోలోనే ఉండిపోవడంతో ఒక్క రోజులో రూ.1.50 కోట్ల ఆదాయం కోల్పోయింది. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 950 బస్సులు ప్రతీరోజు 4 లక్షల కిలో మీటర్లు తిరిగి సగటున రూ.2.30 కోట్ల ఆదాయం వస్తుంది. మధ్యాహ్నం తర్వాత బస్సులు తిరిగినా ప్రయాణికుల సంఖ్య తగ్గింది. దీపావళి పండుగ సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లాలని బస్ స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు.

కలెక్టర్‌కు దీపావళి శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు శనివారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తెలిపిన వారిలో పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేశ్, శ్యామ్ సుందర్, లక్ష్మీప్రసాద్, రాజేశ్ ఖన్నా, కలకోట్ల భారత్, ప్రణయ్, పృథ్వీ, సుధాకర్, నాగరాణి, గ్రేస్ ఉన్నారు.

నేడు నరకాసుర వధ

వరంగల్ రంగలీల మైదానంలో 58 అడుగుల ప్రతిమ ఏర్పాటు

- సాయంత్రం 6 గంటలనుంచి వేదికపై సాంస్కృతిక నృత్యాలు
- మంత్రి సురేఖ చేతులమీదుగా స్విచ్ ఆన్ చేసి దహనం
- ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ, ఏఎస్పీ

సాక్షి, వరంగల్ /ఖిలా వరంగల్: దీపావళి పండుగ సందర్భంగా వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఆదివారం నరకాసుర వధ ఉత్సవం జరగనుంది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలతో డీసీపీలు, ఏసీపీ శుభం ప్రకాశ్ నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా వాహన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. పలు ప్రభుత్వ శాఖల సహకారంతో చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఏఎస్పీ శుభ ప్రకాశ్, ఉత్సవకమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి, ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, ఏఈ సుకృత, తహసీల్దార్ ఇక్బాల్, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ పరిశీలించారు.

23 ఏళ్లుగా..

ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో గత 23 ఏళ్లుగా నరకాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదివారం కరీమాబాద్ ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి శ్రీకృష్ణ సత్యభామ ఉత్సవ మూర్తులు, పిల్లల వేషధారణతో భారీ ఊరేగింపుతో రంగలీల మైదానానికి చేరుకుంటారు. అక్కడే శ్రీకృష్ణ, సత్యభామ డిజిటల్ బొమ్మలను ఏర్పాటు చేయగా.. బాణసంచాలతో కాల్చే ప్రక్రియను నేత్రపర్వంగా నిర్వహిస్తారు. గత ఏడాది 56 అడుగుల నరకాసుర ప్రతిమను ఏర్పాటు చేయగా.. ఈఏడాది 58అడుగుల నరకాసుర ప్రతిమను సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు వేదికపై ప్రత్యేక సాంస్కృతిక నృత్యాలు ప్రారంభమవుతాయని, రాత్రి 8గంటలకు నరకాసుర ప్రతిమను మంత్రి కొండా సురేఖ స్విచ్ ఆన్‌చేయగానే శక్తివంతమైన బాణసంచాతో దహనమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

విజయవంతంగా జరుపుకోవాలి

ఉర్సుగుట్ట మైదానంలో నిర్వహించే నరకాసుర ప్రతిమ దహనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలప్రకారం వేదిక, బారికేడ్లు నాలుగు వైపుల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపడుతున్నాం.

– శుభం ప్రకాశ్ ఏఎస్పీ, వరంగల్



నరకాసుర వధ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం ప్రకాశ్

ఓరుగల్లు ప్రతిష్టను పెంచేలా ఏర్పాట్లు

ఓరుగల్లు ప్రతిష్ఠతను మరింతగా పెంచేలా నరకాసుర వధ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం.



నరకాసుర వధ కోసం వరంగల్ రంగలీల మైదానంలో చేసిన ఏర్పాట్లు

ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయి. వీఐపీ, వీవీఐపీలకు వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశాం. కిలోమీటరు దూరం నుంచి వేడుకలను వీక్షించేలా ఎత్తయిన ప్రదేశంలో 58 అడుగుల నరకాసుర ప్రతిమ ఏర్పాటు చేశాం.

– మరుపల్లి రవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

బీసీ బంద్ సక్సెస్

గ్రేటర్‌లో వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు మూసివేత





బస్సులన్నీ డిపోకే పరిమితమవడంతో నిర్మానుష్యంగా ఉన్న హనుమకొండ బస్‌స్టేషన్, వరంగల్‌లో బీజేపీ నాయకుల నిరసన ప్రదర్శన

- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- బీసీ సంఘాలు, వివిధ పార్టీల ర్యాలీలు
- స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్

హన్మకొండ/వరంగల్‌చౌరస్తా: గ్రేటర్ వరంగల్ పరిధిలో బీసీ బంద్ ప్రశాంతంగా విజయవంతమైంది. శనివారం నగరవ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, సినిమా హాళ్లు మూసివేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీలు రోడ్డెక్కారు. బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ర్యాలీలు తీయడంతో పోరు హోరెత్తింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి, బీఆర్ఎస్ నాయకులు, బీసీ సంఘాల నాయకులు వేకువజామునే ఆర్టీసీ జిల్లా బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వరంగల్-1 డిపో గేట్‌లో బైఠాయించి బస్సులు అడ్డుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో బంద్ ప్రశాంతంగా సాగింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు యథావిధిగా పని చేశాయి. తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు వరంగల్ మహానగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ కూడలి నుంచి ములుగు క్రాస్ రోడ్డులోని జ్యోతిబా పూలే విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



వామపక్ష నాయకుల నిరసన ప్రదర్శన..

ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహంనుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌కు చేరుకుని బస్సులు నడవకుండా అడ్డుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ నాయకులు వడ్లకొండ వేణుగోపాల్, దొడ్డిపల్లి రఘుపతి, బొనగాని యాదగిరి గౌడ్, తమ్మెల శోభారాణి, మూగల కుమార్ యాదవ్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం బాస్కర్, బీఆర్ఎస్ నాయకులు చింతం సదానందం, శోధన్, పులి రజనీకాంత్, పోలెపల్లి రామ్మూర్తి, ముత్తిక రాజు, శ్రీధర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, నాయకులు తోట వెంకటేశ్వర్లు, రవీందర్, పోతుల శ్రీమాన్, విజయశ్రీ, సతీష్, బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్‌లో రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ర్యాలీలు, రాస్తారోకోలు చేశారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా షాపులు మూసివేశాయి. వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్, వాణిజ్య రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వరంగల్ వామపక్షాల నాయకులు హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఐ ఎంఎల్ (న్యూడెమొక్రసీ) జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, రఘుసాల సుమన్, సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, రాచర్ల బాలరాజు పాల్గొన్నారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్ నుంచి సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి కార్యకర్తలు ప్రదర్శనగా బయల్దేరి అండర్ బ్రిడ్జి రోడ్డు, స్టేషన్ రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, వరంగల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నాయకులు వరంగల్ పోస్టాఫీస్ సెంటర్ నుంచి వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, బీట్ బజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అరూరి రమేశ్, జిల్లా కార్యదర్శి రంగయ్య పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎం, పోచమ్మమైదాన్, మండిబజార్, ఆర్ఎస్టీ రోడ్డు, వరంగల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు రాజనాల శ్రీ హరి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ నాయకులు



హనుమకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్, చిత్రంలో మేయర్ సుధారాణి, నాయకులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



హనుమకొండ బస్టాండ్ వద్ద మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ తదితరులు

బీసీ బంద్ ఫొటోలు మరిన్ని: 11లో

ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి కల్పిస్తే పాలకవర్గాలకు ప్రమాదకరం

ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి కల్పిస్తే అది పాలకవర్గాలకు ప్రమాదకరం. కాంగ్రెస్ ద్రోహం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. బీజేపీ, కాంగ్రెస్ కలిసి అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ల కల్పించాయి. మేమెంతో మాకంత వాటా కల్పించాల్సిందే.

– మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

బీసీలకు రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం

బీసీలకు రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం జరుగుతుంది. బీసీ రిజర్వేషన్లకు మద్దతు పలుకుతున్న పార్టీలు పార్టీ పదవుల్లో 50 శాతం పదవులు ఇవ్వాలి. అప్పుడే పార్టీల నిజాయితీ, చిత్తశుద్ధి నమ్ముతాం.

– ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్

42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించం

బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేదిలేదు. బీసీలకు రిజర్వేషన్ల కల్పించాలనే ఆలోచన సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి అడ్డంపట్టే నిర్ణయం.

– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా

రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైంది. బీసీలపై సీఎం సర్కారుది కపట ప్రేమ. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీఓ జారీచేయడంతో ప్రభుత్వం అసలు కుట్ర బయటపడింది.

– బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

కేంద్రం మెడలు వంచైనా..

బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి శనివారం చేపట్టిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో బంద్ విజయవంతమైంది. సకలజనుల సమ్మె తరహాలో బీసీ సమాజమంతా రోడ్లపైకి వచ్చి బంద్ సక్సెస్ చేశారు. రేవంత్ రెడ్డి చేసిన తప్పిదం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా బీసీల రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధం అవుతాయి. తెలంగాణలోని బీజేపీ నాయకత్వం ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా కృషి చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తాడోపేడో తేల్చుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి రిజర్వేషన్లు సాధిస్తాం. బంద్‌కు సహకరించిన అన్ని వర్గాలకు కృతజ్ఞతలు.

– వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్

వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్ : మహా నగరంలో వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని మేయర్ గుండు సుధారాణి హెచ్చరించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆమె ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ దీపావళి పర్వదినం సందర్భంగా ప్రతీ లైటు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరవాసులకు నీటి సరఫరాలో ఆటంకాలు లేకుండా క్షేత్రస్థాయిలో లోపాలను అరికట్టాలన్నారు. అవసరం మేరకు నీటి సరఫరా జరగని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అందించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఉర్సు రంగ లీలా మైదానం జరిగే నరకసుర వధ కార్యక్రమానికి బల్దియా తరఫున విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మహేందర్, సంతోశ్‌బాబు, మాధవీలత, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, రాగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించాలి..

నగరంలో బాణసంచా విక్రయదారులు ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బాణసంచా దుకాణదారులు పాటించాల్సిన విధివిధానాలు, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులతో మేయర్ సమీక్షించి మాట్లాడారు. నగర వ్యాప్తంగా వరంగల్‌లో 3 ప్రాంతాల్లో, హనుమకొండ పరిధిలో 6 దుకాణాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రతీ టపాసుల దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలు ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

చివరి రోజు వైన్స్‌కు దరఖాస్తుల జోరు..

వరంగల్ అర్బన్‌లో 2,186, వరంగల్ రూరల్ 989

కాజీపేట అర్బన్ : వరంగల్ అర్బన్ పరిధిలోని 67 వైన్స్‌కు 2025-27 సంవత్సరానికి టెండర్లు పిలవగా శనివారం చివరి రోజు 2,186 దరఖాస్తులు వచ్చాయి. టెండర్ ప్రక్రియ ప్రారంభించిన నాటినుంచి శనివారం వరకు మద్యం వ్యాపారులు 3,621 దరఖాస్తులు అందజేశారు. వరంగల్ రూరల్‌లోని 57 వైన్‌షాపులకు గాను చివరిరోజు 989 దరఖాస్తులు రాగా, మొత్తంగా 1,905 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కాగా, టెండర్ దరఖాస్తుల ద్వారా వరంగల్ అర్బన్‌కు రూ.108 కోట్లు, వరంగల్ రూరల్‌కు రూ.57 కోట్ల ఆదాయం వచ్చింది.

మానసిక దివ్యాంగులకు సత్వర న్యాయసేవలు

హనుమకొండ జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పట్టాభిరామారావు



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పట్టాభిరామారావు

హన్మకొండ అర్బన్: మానసిక దివ్యాంగులకు సత్వర నాయసహాయం అందించేందుకు మనో న్యాయ్ లీగల్ క్లినిక్‌లు ఎంతో ఉపయోగపడతాయని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అధ్యక్షత మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మనోన్యాయ్ లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసిక వికలాంగులకు న్యాయసేవలు ముఖ్యంగా సైకియాట్రిక్ సేవలు, ఆధార్, సోషల్ ఎంటైటిల్ సదుపాయాలు అందించేందుకు తగిన చర్యలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చేపడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అనితారెడ్డి, డాక్టర్ ఎస్.సాగ్నిక్ ముఖర్జీ, డాక్టర్ కె. ప్రహసిత్, సీడబ్ల్యూసీ సభ్యుడు సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్, మల్లికాంబ నిర్వాహకురాలు బండ రామలీల, పద్మ, శ్రీకాంత్. సీనియర్ న్యాయవాది గోపు వనజ పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డులో..

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డులోని శంకర్‌నగర్‌లో వారిధి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.అపర్ణదేవి శనివారం ప్రారంభించారు. న్యాయసేవలను వినియోగించుకోవాలని కోరారు. హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ క్షమాదేశ్‌పాండె, కమ్యూనిటీ మధ్యవర్తిత్వ వలంటీర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

ఏపీ ప్రభుత్వానికి ఇది మంచిదికాదు

- సాక్షి దినపత్రిక, ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని, ఉద్దేశపూర్వకంగా సాక్షి దినపత్రికపై దాడులు, ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు ఖండిస్తున్నారు. నిజాలను నిర్భయంగా రాస్తే అక్కడి పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధి అనే విషయాన్ని మర్చిపోవద్దని సూచిస్తున్నారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు - సాక్షి నెట్‌వర్క్

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి



నెహ్రూసెంటర్: సాక్షి దినపత్రిక, ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. పత్రికా స్వేచ్ఛను హరిస్తే సమాజానికి మేలు జరగదు. జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం సుపరిపాలన అనిపించుకోదు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదు.

- ఎం.వివేక్, డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు..



హన్మకొండ అర్బన్: ఏపీలో సాక్షి మీడియాపై అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. సాక్షి మీడియాను, సంస్థ ప్రతినిధులను, జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురిచేయడం దుర్మార్గపు చర్య. పత్రికా స్వేచ్ఛను కాలరాయడమంటే ప్రజల పక్షాన మాట్లాడే గొంతుకను నొక్కడమే.

- ఆకుల రాజేందర్, ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్, హనుమకొండ

దాడులను ఖండిస్తున్నాం..



జనగామ: ప్రభుత్వం చేసే మంచి, చెడులను ప్రజలకు తెలియజేస్తూ, మనకు దారి చూపించే పత్రికలపై ఏపీ సర్కార్ తీరు సరికాదు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండిస్తున్నాం. సమాజంలో పత్రికలే మార్గదర్శకంగా ఉండి మనల్ని నడిపిస్తున్నాయి.

-పెండెల శ్రీనివాస్, గ్రామ పరిపాలన ఆఫీసర్, రాష్ట్ర నాయకుడు, జనగామ

కేసుల నమోదు సరికాదు



ములుగు రూరల్: సాక్షి కార్యాలయాలపై ఏపీ ప్రభుత్వం దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. సమాజంలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు తెలియజేసే పత్రికలపై దాడులు, ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సరికాదు. ఏపీ ప్రభుత్వం సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి.

- పోలు రాజు, టీఎన్జీఓ ములుగు జిల్లా అధ్యక్షుడు

శిల్ప కళాసంపద మహాద్భుతం

● టాంజానియా దేశ సివిల్ సర్వెంట్లు


కాకతీయ కళాతోరణం ఎదుట టాంజానియా సివిల్ సర్వెంట్ల బృందం

ఖిలా వరంగల్: చారిత్రక వైభవాన్ని చాటే కాకతీయుల రాజధాని నిర్మాణం, నల్లరాతితో తయారైన నాటి శిల్ప కళా సంపద మహాద్భుతంగా ఉందని టాంజానియా దేశ మిడ్ లెవెల్ సివిల్ సర్వెంట్ అధికారులు కొనియాడారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ (డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ)లో ప్రొఫెసర్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ రావులపాటి మాధవి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న టాంజానియా దేశానికి అధికారులు శనివారం సాయంత్రం ఖిలా వరంగల్ కోటను సందర్శించారు. కాకతీయులు కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుత శిల్ప సంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిలగుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను పర్యాటక శాఖ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, కోట గైడ్ రవియాదవ్ వివరించారు. ఆనాటి కట్టడాలు, శిల్పకళా సంపద అద్భుతంగా ఉందని కొనియాడారు. అనంతరం వారు టీజీ టీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే సౌండ్ అండ్ లైటింగ్ షోను తిలకించారు. వారి వెంట ఎంసీహెచ్ఆర్డీ విజిట్ కో–ఆర్డినేటర్ నందకిషోర్, కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టూరిజం అభివృద్ధి సంస్థ మేనేజర్ అజయ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాలన గాడిన పడినట్లేనా?

● కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి పాలనకు నేటితో ఏడాది పూర్తి
● వినియోగంలోనికి రాని కె హబ్, డైనింగ్ హాల్
● కమిటీలు వేసి చర్యలు తీసుకోవడంలో జాప్యం
● కొన్నేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..
● వేధిస్తున్న రెగ్యులర్ అధ్యాపకుల కొరత




కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కొన్నేళ్లుగా పలు సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. రెగ్యులర్ వీసీగా ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పుడు వర్సిటీలోని వివిధ సమస్యలు పరిష్కారమవుతాయని అంతా భావించారు. కానీ, ఆయన ఏనిర్ణయం తీసుకోవడంలోనైనా, దృష్టికి వచ్చిన సమస్యకు పరిష్కారం చూపడంలోనైనా స్లో పాలన కొనసాగిస్తున్నారు. వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించి ఈనెల 19 (ఆదివారం)తో ఏడాది పూర్తవుతోంది. పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది. ఈఏడాదిలో వీసీగా కేయూలో చేపట్టిన కార్యక్రమాలు, పరిష్కారానికి నోచుకున్న సమస్యలు, చేపట్టబోయే అభివృద్ధిపై ప్రత్యేక కథనం.

పాఠాల బోధనేది?

కేయూలో కొన్నేళ్లుగా వివిధ విభాగాల్లో, వివిధ వర్సిటీ కాలేజీల్లోనూ సరిగ్గా తరగతులు జరగడం లేదు. ఉన్న రెగ్యులర్ అధ్యాపకుల్లో కొందరు పరిపాలనా పదవుల్లో కొనసాగుతున్నారు. పాఠాల బోధనపై ఆసక్తి కనబర్చడంలేదు. కొందరు రెండు, మూడు, నాలుగు పదవుల్లోనూ కొనసాగుతుండడం బోధనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకుల్లోనూ కొందరు తరగతులు సరిగ్గా తీసుకోవడం లేదని, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. కాగా, ఇటీవల వీసీ ప్రతాప్‌రెడ్డి బాటనీ విభాగాన్ని తనిఖీ చేయగా టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఎవరూ లేరని గుర్తించారు. ఫార్మసీ కాలేజీకి వెళ్లగా, అక్కడ ప్రిన్సిపాల్, మరో ప్రొఫెసర్ ఉన్నారు. మిగతా పలువురు అధ్యాపకులు ఆసమయంలో విధుల్లో లేరని గుర్తించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్లు సమాచారం. వివిధ విభాగాల్లో ప్రాక్టికల్స్ కూడా మొక్కుబడిగానే చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


కేయూలో వినియోగంలోకి తీసుకురావాల్సిన కె హబ్ భవనం

ఏడాదిలో ఏం చేశారంటే..

- ఈఏడాది జూలై 7న కేయూ 23వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించారు.
- పలు సంస్థలతో ఎంఓయూలు చేపట్టారు.
- ఆరోపణలు వచ్చిన వారిపై కమిటీలు వేశారు. పలువురిపై చర్యలు తీసుకున్నారు. మరో రెండు మూడు నివేదికలపై ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.
- గతంలోకంటే కేయూకు బ్లాక్‌గ్రాంటును ఈఆర్థిక సంవత్సరంలో కేయూకు బడ్జెట్‌ను రూ.145 కోట్ల వరకు పెంచడానికి వీసీ కృషి చేశారు. గత మూడునెలలుగా పెన్షనర్లకు ప్రభుత్వం పెన్షన్‌ను మంజూరు చేయడం లేదు. వర్సిటీ అంతర్గత నిధుల నుంచి చెల్లిస్తున్నారు.
- రూసా ప్రాజెక్టుల, సైన్స్ రీసెర్చ్‌ప్రాజెక్టుల పరిశోధనలకోసం సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ భవనం, మహిళా హాస్టల్ భవనం, పద్మాక్షి మహిళా హాస్టల్‌లో నూతనంగా డైనింగ్ హాల్ నిర్మించబోతున్నారు.
- కేయూలోని మహిళా హాస్టళ్లన్నింటికీ కలిపి రూ.3.50 కోట్ల వ్యయంతో ప్రహరీ నిర్మించబోతున్నారు.
- కేయూ చుట్టూ ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు రూ.20 కోట్ల యూనివర్సిటీ నిధులతో 10.2 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మించబోతున్నారు.
- కేయూ పీజీ హాస్టల్ డైనింగ్ హాల్ వద్ద మరో రూ.40 లక్షలు వెచ్చించి కిచెన్ షెడ్డును నిర్మించారు. దీన్ని త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

సమస్యలు అలాగే..

- వర్సిటీలో అడ్మిషన్లు పొందిన వారిలో కొందరికి వసతి కల్పించలేకపోతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఫస్ట్ ఇయర్‌లో ఎవరికీ హాస్టల్ వసతి కల్పించడం లేదు. మరో రెండు హాస్టళ్ల భవనాలు అవసరం ఉంది.
- న్యూపీజీ హాస్టల్ వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మించి మూడేళ్లవుతోంది. నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు.
- వర్సిటీ కాలేజీల్లో అధ్యాపకుల కొరత ఉంది. పార్ట్‌టైం లెక్చరర్లను నియమించాలనే డిమాండ్ ఉంది. ఇటీవల పాలకమండలి కూడా పార్ట్‌టైం లెక్చరర్ల నియామకానికి ఓకే చెప్పింది.
- రూ.4.50 కోట్లతో నిర్మించిన కె హబ్‌ను ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు.
- పీవీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయలేదు.
- రూసా ప్రాజెక్టు కింద రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. వివిధ విభాగాల ప్రొఫెసర్లు ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు చేపట్టలేదు.
- సూపరింటెండెంట్లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది.
- నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు 150 వరకు భర్తీ చేయాల్సి ఉంది.
- 1992 నుంచి రెగ్యులర్ బోధనేతర ఉద్యోగుల నియామకాలు లేవు.
- పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించాలనే డిమాండ్ అలాగే ఉండిపోయింది.
- రెగ్యులర్ అధ్యాపకులు 77 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 15 ఏళ్లుగా నియామకాలు లేవు.
- కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలో అడ్మిషన్ల సంఖ్య పడిపోతోంది. ప్రవేశాలు పొందిన వారికి సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించడం లేదు. పరీక్షలు సకాలంలో నిర్వహించడం లేదు.
- కేయూ భూముల ఆక్రమణలు గుర్తించి స్వాధీనం చేసుకోవడం లేదు.

ఏటీఎంలో నగదు కొల్లగొట్టేందుకు యత్నం

● మిషన్ తెరుచుకోకపోవడంతో దొంగలు పరార్


ధ్వంసమైన ఏటీఎం మిషన్

కాజీపేట: కాజీపేటలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించి మిషన్‌ను ధ్వంసం చేశారు. ఏటీఎం మిషన్‌లో డబ్బులు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించిన దుండగులు ముఖాలకు ముసుగులు ధరించి.. వెంట తెచ్చుకున్న ఆయుధాలతో మిషన్‌ను ధ్వంసం చేశారు. ఎంత ప్రయత్నించినా డబ్బులు బయటకు వచ్చే బాక్స్ మాత్రమే ఓపెన్ అయ్యింది. దీంతో దుండగులు కోపంతో మిషన్‌ను ఇష్టం వచ్చినట్లుగా ధ్వంసం చేసి నిరాశతో పరారయ్యారు. ఉదయం వేళ డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వారు గమనించి 100 డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి ఎస్‌బీఐ అధికారులతో పాటు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, శివ క్రైం పార్టీ సిబ్బందితో చేరుకుని ఆధారాల కోసం ప్రయత్నించారు. రహదారులపై ఉన్న సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. ఇది స్థానిక దొంగల పనేనా? లేక ఇతర ప్రాంతాలకు చెందినవారెవరైనా చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఏటీఎంలో దాదాపు రూ.7లక్షల వరకు నిల్వ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

దీపావళి పండుగ రైళ్లు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా దీపావళి పండుగకు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు యశ్వంత్‌పూర్–ముజఫర్‌పూర్ మధ్య రెండు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు శనివారం రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. అక్టోబర్ 22వ తేదీన యశ్వంత్‌పూర్ – ముజఫర్‌పూర్ (06261) ఎక్స్‌ప్రెస్ గురువారం కాజీపేటకు చేరుకొని వెళ్తుంది. అదేవిధంగా అక్టోబర్ 24వ తేదీన ముజఫర్‌పూర్–బెంగళూర్ సీఎఎస్‌టీటీ (06262) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు శనివారం చేరుకొని వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు ఎలహంక, ధర్మవరం, అనంతపూర్, డోన్, మహబూబ్‌నగర్, కాచిగూడ, కాజీపేట, రామగుండం, బల్లార్షా, నాగపూర్, ఇటార్సీ, జబల్‌పూర్, సంత, ప్రయాగ్‌రాజ్, చోకి, పండిట్ డీడీ ఉపాధ్యాయ, బాక్సర్, ఆర, ధానాపూర్, పాటలీపుత్ర, సోనాపూర్, హజీపూర్ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్ఓ తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. నవంబర్ 5న జరిగే గిరి ప్రదక్షిణకు అదే నెల 3న హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చార్జీ పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.3,500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ టికెట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీ పూర్తి సమాచారం కోసం 90634 07493, 77805 65971, 98663 73825, 99592 26047 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోర్టులు.. న్యాయం పంచే పవిత్ర స్థలాలు

● హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి
● నూతన కోర్టు భవన సముదాయానికి భూమిపూజ

జనగామ: కోర్టులు న్యాయం పంచే పవిత్ర స్థలాలు అని, న్యాయం జరిగిందన్న నమ్మకంతో కక్షిదారులు కోర్టు నుంచి తిరిగి వెళ్లేలా చూడడం ప్రతీ న్యాయవాది బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం చంపక్ హిల్స్ వద్ద రూ.81 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి హైకోర్టు జడ్జీలు నామవరపు రాజేశ్వరావు, బీఆర్ మధుసూదన్‌రావు, సుద్దాల చలపతిరావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా న్యాయమూర్తి బి.ప్రతిమ, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్, తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. బాణాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, సిద్ధాంతి క్రిమాచారి మంత్రోచ్చరణల నడుమ కోర్టు నూతన భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం హైకోర్టు జడ్జీలు మొక్కలు నాటి నీరు పోశారు.


నూతన కోర్టు భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

న్యాయవాదులు మెరుగైన పాత్ర పోషించాలి..

సిద్దిపేట రోడ్డులోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసుల పరిష్కారం విషయంలో న్యాయవాదులు ప్రావీణ్యతతో మరింత మెరుగైన పాత్ర పోషించాలన్నారు. కక్షిదారులకు సమగ్ర, ధర్మబద్ధ న్యాయం అందించడం న్యాయవాదుల ప్రధాన లక్ష్యమన్నారు. వరకట్న వేధింపులు, చెక్ బౌన్స్ కేసులు కుటుంబ తగాదాలు, భాగస్వామ్య కేసులు ఎక్కువగా వస్తున్నాయని, వీటిని త్వరతగతిన పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో న్యాయవాదులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్టు భవనం రెండేళ్లలో పూర్తవుతుందని కాంట్రాక్టర్ చెప్పారని, కానీ, 20 నెలల్లో ప్రారంభోత్సవం చేసుకుంటామనే నమ్మకం ఉందన్నారు. అనంతరం హైకోర్టు ఆధ్వర్యంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ప్రతిమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్, సీనియర్ సివిల్ జడ్జిలు సి.విక్రమ్, సుచరిత, ప్రిన్సిపల్ జూనిర్ సివిల్ జడ్జి శశి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సందీప, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరాం నర్సయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్

● హెప్టాథ్లాన్‌లో తెలంగాణకు గోల్డ్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు కొనసాగిన జాతీయస్థాయి 5వ అథ్లెటిక్స్ అండర్–23 చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పలు ఈవెంట్లలో పతకాల కోసం అథ్లెట్లు పోటీపడ్డారు. పోటీల ఏర్పాట్లను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి, అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు వాసుదేవరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. చివరి రోజు జరిగిన పోటీల్లో మహిళల 800 మీటర్ల హెప్టాత్లాన్ విభాగంలో తెలంగాణ నుంచి కేతావత్ సింధు బంగారు పతకాన్ని సాధించింది.


స్టిపుల్ చేజ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

రికార్డులు బ్రేక్

మూడు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పలువురు అథ్లెట్లు వివిధ విభాగాల్లో పాత రికార్డులు బ్రేక్ చేసి కొత్త రికార్డులు సృష్టించారు. 100 మీటర్ల మహిళల విభాగంలో సుదీప్న హనమంత శివాంకర్ (మహారాష్ట్ర), 100 మీటర్ల మహిళల పరుగు విభాగంలో సాక్షి (గుజరాత్), డిస్కస్‌త్రో మహిళల కేటగిరీలో నిఖితకు మారి (రాజస్తాన్), పురుషుల 20వేల మీటర్ల రేస్‌వాక్‌లో సచిన్‌బొహారా(ఉత్తరాఖండ్), పురుషుల లాంగ్ జంప్‌లో అనురాగ్ సీవీ (కేరళ), 400ల మీటర్ల పురుషుల హార్డిల్స్‌లో అర్జున్ ప్రదీప్ (కేరళ) కొత్త రికార్డులు సృష్టించారు. లాంగ్ జంప్ అనురాగ్ సీవీ తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్నాడు. 2024లో తన పేరు మీద ఉన్న 7.87 మీటర్ల పాత రికార్డు 8.08 మీటర్లతో కొత్త రికార్డును సృష్టించాడు. కాగా 400ల మీటర్ల పురుషుల హార్డిల్స్ విభాగంలో కేరళకు చెందిన అర్జున్ ప్రదీప్ రికార్డు బ్రేక్ చేశాడు. 2022లో యాషెస్ (కర్ణాటక) 50.89 పేరున ఉన్న పాత రికార్డును అర్జున్‌ప్రదీప్ 50.29 స్కోర్‌తో రికార్డు సృష్టించాడు.


హార్డిల్స్‌లో క్రీడాకారిణులు..

జూనియర్ ఫ్యాషన్ వీక్‌లో వరంగల్ చిన్నారి


ఫ్యాషన్ వీక్‌లో మైరా క్యాట్‌వాక్

వరంగల్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఫ్యాషన్ వీక్ జూనియర్స్ అనే కార్యక్రమంలో వరంగల్ ఫ్రీ స్కాలర్స్ మాంటిసోరి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన మైరా చేసిన క్యాట్ వాక్ అందరినీ ఆకర్షించింది. బెస్ట్ పర్ఫార్మెన్స్‌గా ఎంపికైంది. రెండేళ్ల 9నెలల వయస్సు ఉన్న మైరా ఇటీవల పదవీ విరమణ చెందిన ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలేపాక నిర్మల మనుమరాలు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద


సమీక్షలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో వైద్య, ఆరోగ్యశాఖ, ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల లభ్యత, వైద్యుల హాజరు, పరీక్ష పరికరాల వినియోగం, మాతాశిశు సంరక్షణ వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్ సర్వే నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సిజేరియన్లు కాకుండా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ప్రైవేట్ డాక్టర్లు విధిగా సాధారణమైన ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు ప్రకాశ్, కొంరయ్య, ప్రోగాం అధికారులు రవీందర్, ఆచార్య, విజయ్‌కుమార్, మోహన్‌సింగ్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి సన్నద్ధం కావాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
● ట్రాన్స్ కో, డిస్కం అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: యాసంగి సాగుకు సన్నద్ధం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. హనుమకొండ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌కో సీఈలు, ఎస్ఈలు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈలు, ఎస్ఏఓలతో శనివారం సమీక్ష నిర్వహించారు. డివిజన్లు, జిల్లాల వారీగా ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కొత్తగా నెలకొల్పే 220/33 కేవీ, 132/33 కేవీ కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, డబుల్ సర్క్యూట్ లైన్లు, బే ఎక్స్‌టెన్షన్ ప్రతిపాదనలు పంపాలని, పురోగతిలో ఉన్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులకు ట్రాన్స్‌కోకు లేఖలు రాయాలని సూచించారు. ట్రాన్స్ కో, ఎన్పీడీసీఎల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు తగ్గించాలని, రిపేర్లు పెంచాలన్నారు. వ్యవసాయ, కొత్త సర్వీసులు, టీజీఐ పాస్‌లో నమోదు చేసుకున్న సర్వీసులు త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, కె.తిరుమల్‌రావు, అశోక్, రాజు చౌహాన్, ట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్ శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

వేగంగా సాంకేతికత అభివృద్ధి

● ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి


గ్రాడ్యుయేషన్ డేలో ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి: నేటి ఆధునిక యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ జీవితంలో కొత్త ప్రారంభమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు ఝాన్సీరాణి, ఎస్.శ్వేత తదితరులు పాల్గొన్నారు.